సీరియల్
ముద్దా సురేష్

(నాల్గవ భాగము)

టీచర్ ఆకారం మూడడుగుల దగ్గరగా వచ్చినపుడు అతన్ని స్పష్టంగా చూడగలిగాడు రాణా.

సన్నగా పొడుగ్గా ఉన్నాడతను.

ఒక చేయి మాత్రమే పూర్తిగా వుంది.

రెండోది-మొండిచెయ్యి.

మోచేతి దగ్గర అంతమయ్యింది.

"అంతా ఆ డ్రైవర్ దే తప్పండి. ఆ వెధవకి నేను చెబుతూనే ఉన్నాను. కాని... వింటేనా? పిల్లల్తో జోకులు వేస్తూ పొగ మంచుని చూడనేలేదు లోపలికి ప్రవేశించేదాకా. సమయాన్ని స్లో చెయ్యలేకపోయాడు. తీసికెళ్ళి పల్లంలోకి గుద్దించాడు. కమీనే" అంటూ ఆగి, వెనక్కి తిరిగి తన చుట్టూ మూగుతున్న పిల్లల్ని గసిరాడు 'పొండ్రా కోతి మూకల్లారా!"

స్కూలు పిల్లలు అల్లరి చేసుకుంటూ తిరిగి బస్సు వైపు వెళ్ళిపోయారు.

"ఒకసారి డ్రైవర్ని చూద్దాం పదండి" అన్నాడు రాణా.

ఇద్దరూ బస్సులోకి నడిచారు.

రక్తసిక్తమైన చేతి రుమాలుతో గాయాన్ని నొక్కిపట్టి, బాధగా మూల్గుతున్నాడు డ్రైవర్, ఓ సీట్లో.

రాణా అతనిమీదకు వంగాడు. "చెయ్యి తియ్యి డ్రైవర్! దెబ్బను చూడాలి."

రక్తంతో తడిసి ముద్దయిన హాండ్ కర్చీఫ్ లాక్కొని బైటికి విసిరేశాడు.

గాయం చాలా పెద్దది.

రక్తం ధారాళంగా కారోంది.

తన జేబులోంచి కర్చీఫ్ బైటకి తీసి, అతని గాయం మీద ఉంచాడు రాణా. గట్టిగా పట్టుకొని వుండమని డ్రైవర్ కి చెబుతూ "కొద్దిదూరం పోతే టౌన్లో ఓ డాక్టరు వుండాలి" అన్నాడు అసహనంగా టీచర్ "కాని అక్కడి వెళ్ళడమే ప్రాబ్లెం"

"మీరు పిల్లలతో యిక్కడే వుండండి. ఇతన్ని మాతో డాక్టరుదగ్గరికి తీసుకువెళ్తాం. అక్కడి పోలీసులకి రిపోర్టుయిస్తే-వాళ్ళు యిటుగా వచ్చే లారీనిగాని మరేదైనా వెహికల్ నిగాని ఎరేంజ్ చేస్తారు పిల్లల్ని తరలించడానికి" అన్నాడు రాణా.

"ఓహ్! థాంక్యూ వెరీమచ్ సర్! త్వరగా యేదో అరేంజ్ చేయాలి పిల్లలకి"

తల ఊపాడు రాణా.

ఇద్దరూ, డ్రైవర్ ని కారు దగ్గరికి నడిపించి వెనక సీట్లో కూర్చోబెట్టారు.

పిల్లల బస్సు ప్రయాణం గురించి చెప్పసాగాడు టీచర్.

"మాది కాంబేలో ఓ ప్రైవేట్ బోర్డింగ్ స్కూల్. పేరు రణధావే ప్రైమరీ స్కూలు. ఎక్స్కర్షన్ కోసం బొంబాయి బయలుదేరాం. ఆ ప్రోగ్రాం ఈ విధంగా చెడిపోయింది. నా పేరు పరంజ్యోతి. ఆప్ కా నామ్.."

"రాణా....మిస్టర్ పరంజ్యోతి! మీ పొజిషన్లో నేనుంటే ఆ పిల్లల్ని బస్సుల్లో ఉంచి అద్దాల కిటికీలన్నీ బంద్ చేయిస్తాను."

ప్రశ్నార్థకంగా చూసాడు టీచర్ "ఎందుకు?"

"పొంగమంచు వాళ్ళ ఆరోగ్యానికి మంచిది కాదు. అంతే చెప్పగలను. మీరు కూడా బస్సులో కూర్చోండి! నేను దగ్గర్లోని టౌను చేరుకోగానే తప్పకుండా మీ

అందర్నీ తరలించే ఏర్పాటు చేస్తాను." కార్లో కూర్చొని యిగ్నిషన్ తిప్పాడు రాణా. తల త్రిప్పి మళ్ళీ అన్నాడు. "పిల్లలందరిర్నీ బస్సులో వుంచి కిటికీతలుపులు మూయండి."

"పొగమంచు పిల్లలకి పెద్ద ప్రమాదమనుకోనుసార్. బయట వెచ్చగానే...."

ఇంజన్ని స్టార్ట్ చేసి కార్ని ముందుకు దూకించాడు రాణా, జాగ్రత్తగా.

ఎదురుగావున్న పొగమంచు గురించి, దాని వాసన గురించి యింకా ఇబ్బందిగానే ఫీలవుతున్నాడు రాణా.

అటువంటి వాసన వుంటుందని, అతనికి భూకంపానికి గురికాకముందు ఎప్పుడూ తెలీదు. అలాగని పొగమంచు....

వెనక సీట్లోంచి వెలువడ్డ మూలుగు రాణా ఆలోచనల్ని భగ్నం చేసింది. "తల భారంగా వుంది." గొణిగాడు డ్రైవర్ బాధగా.

"అర గంటలో నిన్ను డాక్టరు దగ్గరికి చేరుస్తాం. కొంచెం ఓర్చుకో" ధైర్యం చెప్పింది లూసీ.

నిముషం తర్వాత రాణా మీదకి ఒరుగుతూ అన్నది లూసీ "రాణా! ఒకసారి కారాపు!"

తల త్రిప్పి ప్రశ్నార్థకంగా చూడసాగాడు రాణా. "ఎందుకు?"

సిగ్గుపడుతూ చిటికెనవ్రేలు చూపించింది.

తల అడ్డంగా తిప్పాడు రాణా. "అయామ్ సారీ! యిప్పుడు కాదు."

"కారణం?"

"పొగమంచు. నువ్వు కారు దిగి అందులోకి నడవటం నా కిష్టంలేదు."

ఆమె ముఖంలో రంగులు మారాయి. "ఆర్ యూ

ష్యూర్?"

"నో" అద్దంలోంచి బైటికి చూస్తూ చెప్పాడు రాణా "ముందు జాగ్రత్త."

కొంతసేపు మౌనం.

ఎదురుగావున్న పొగమంచు దట్టంగా మారుతున్నట్లు కొద్దిసేపట్లో గ్రహించాడు రాణా.

దీనికి అంతం లేదా?

ఎన్ని మైళ్ళు ఆవరించింది యిది??

వేగం యింకా తగ్గించాడు. "రాణా! ఏవిటది??"

హఠాత్తుగా అతని చేయిని పట్టుకుంది లూసీ. ఆమె కళ్ళు భయంగా, అతని కుడివైపు కిటికీలోంచి దేన్నో చూస్తున్నాయ్.

రాణా ఉలిక్కిపడి, తలత్రిప్పి, అటువైపు చూసాడు. సుడులు తిరుగుతున్న పొగమంచు తప్ప ఏమీ కనబడ లేదు అతనికి.

"వాటీజిట్ లూసీ? నాకేం కనపడ్డంలేదు."

"అది మాయమైపోయింది. అది ఏమీ కాకపోవచ్చు. కానీ నా కళ్ళకు ఏదో తళుక్కున మెరిసిన వెలుగుని చూసినట్లయింది! తెల్లగా, పొగమంచు మధ్యగా మెరుస్తూ!

"కాని అది క్షణంలో మాయమైపోయింది! బహుశా మరో పొగ దొంతర దానిమీదుగా పాకివుండాలి."

"బహుశా, సూర్యకాంతి దాని మధ్యగా ప్రసరి స్తూండడవల్ల అలా కనిపించి వుండాలి" అన్నాడు రాణా.

"ఏమో."

వెనకాల డ్రైవర్ ఏదో గొణుక్కోవటంతో వాళ్ళ దృష్టి మళ్ళింది.

"దరిద్రగొట్టు వాతావరణం. ఒక నిముషం ప్రకాశవంతంగా వుంటోంది. మరోనిముషం దట్టమైన ఆ పొగమంచు. కలికాల మహాత్యం. దానికి తగట్టు విచిత్రమైన హత్యలు...."

రాణా తల విదిలించాడు, డ్రైవింగ్ మీద దృష్టి లగ్నం చేస్తూ.

"హత్యలేమిటి డ్రైవర్?" అడిగింది లూసీ, తల వెనక్కి తిప్పి.

"నిన్న పేపర్స్ చూడలేదా మేమ్‌సాబ్? ఈ ప్రాంతాలకి ఏదో వినాశకాలం దాపురించినట్లుంది" నుదుటిమీద గాయపు బాధను ఓర్చుకుంటూ కళ్ళు మూసుకుని చెప్ప సాగాడు డ్రైవర్.

"భూకంపం ఏర్పడిన భావ్‌నగర్ ప్రక్క గ్రామంలో విచిత్రమైన హత్యలు జరిగాయ్. ఎవరో మాజీ మిలట్రీ మనిషట. ధనవంతుడట. అతన్నీ, అతని భార్యనీ.... ఇంకా ఆ యింట్లో పనిచేసే వంటమనిషినీ....పనిమనిషిని కూడా అనుకుంటా, మూకుమ్మడిగా ఖూనీ చేసేసాడు, ఓ వ్యక్తి 'గొడ్డలితో'. తర్వాత ఆ దరిద్రుడు తన కాళ్ళనీ, చేతుల్నీ చచ్చిపోయేదాకా, తనని తానే నరుక్కున్నాడట అదే గొడ్డలితో.

రాణా కూడా మౌనంగా విన్నాడా కథని.

"మేమ్ సాబ్! యిప్పుడు నా ఉద్యోగం వూడుతుంది."

"ఎందుకు?" అడిగింది లూసీ.

"మా హెడ్మాస్టర్ సంగతి మీకు తెలీదు. నేనంటే

ఆయనకి యిష్టం లేదు. అలాగే టీచర్ పరంజ్యోతికూడా వాళ్ళ ఇంట్లో పనులు చేయనన్నానని-కసి పెట్టుకున్నారు. ఇప్పుడు ఈ యాక్సిడెంట్ చేశానన్న వంకతో నన్ను వుద్యోగంనుండి ఊడపీకిస్తాడు."

"మరో పదిహేను నిమిషాలు వారు ముగ్గురూ దట్టమైన పొగమంచులో ప్రయాణించారు.

కారు అకస్మాత్తుగా పొగమంచులోంచి బైట పడింది.

ఇప్పుడు ముందు రోడ్డంతా సూర్యరశ్మితో క్లియర్ గా వుంది!

తలుపు తెరుచుకుని బైటకు వెళ్ళినట్టు ఆ మార్పు క్షణాల్లో జరిగిపోయింది.

రాణా, లూసీ వెనక్కి చూసారు ఆశ్చర్యంగా!

తలమీంచి దుప్పటి తొలగించినట్లు విచిత్రంగా అది పొలాలమీదుగా ప్రయాణించసాగింది....

ఇద్దరూ సంతృప్తిగా నిట్టూర్చారు.

"చాలా ఆశ్చర్యంగా వుంది కదూ," గొణిగింది లూసీ.

రాణా ఏమీ వ్యాఖ్యానించలేదు.

కారు రాకెట్ వేగాన్ని పుంజుకుంది!

కొద్దిసేపట్లో రోడ్డు వారగా వారికి ఓ పోలీస్ స్టేషన్ ఎదురయింది. లోపల వివరాలు చెప్పి హెల్ప్ అడిగాడు రాణా.

ఒకవంక పిల్లలు గాయపడలేదని చెబుతూ, రాణా అంత గాభరా యెందుకు పడుతున్నాడో అర్థం కాలేదు సబిన్స్పెక్టర్ కి.

పిల్లల్ని తరలించడానికి వెంటనే పోలీస్ వేన్ పంపే ఏర్పాటు చేస్తానని ప్రామిస్ చేశాడు.

అతనే దగ్గర్లో వున్న డాక్టరు వివరాలు చెప్పాడు.

కారు మళ్ళీ బయలుదేరింది.

డ్రైవర్‌ని డాక్టర్ సురక్షిత హస్తాలకి అప్పగించి, సంతృప్తిగా ఫియట్‌ని బొంబాయివైపు వురికించాడు రాణా.

* * *

మెరైన్ డ్రైవ్‌లో ఓ పెద్ద బిల్డింగ్‌లోని ఒక ఫ్లాట్‌ని అద్దెకు తీసుకుని వుంటున్నాడు రాణా.

కారు కాంపౌండ్‌లో ఆపి, లిఫ్ట్ పై అంతస్థులో వుండడంతో, మెట్లు ఎక్కి పైకి వెళ్ళారు ఇద్దరూ.

తనఫ్లాట్ ముందు నిలబడి, తలుపు తెరిచాడు రాణా.

ఇద్దరూ లోనికి అడుగు పెట్టారు.

లోపల అందమైన పెయింటింగ్స్ గోడలకు అలంకరించబడి వున్నాయి.

మోడరన్ ఫర్నిచర్‌తో అందంగా అలంకరించబడి వుంది సిట్టింగ్ రూమ్.

అలసటగా నిట్టూరుస్తూ కుషన్ ఛేర్‌లో కూలబడ్డాడు రాణా, బూట్లని చిరాగ్గా విప్పేస్తూ.

రెండు నిముషాల్లో లూసీ రెండు కాఫీ కప్పులతో బైటికి వచ్చింది, వంట గదిలోంచి.

అతని కాళ్ళదగ్గర కూర్చుంది, కాఫీ కప్పుల్ని నేలమీద వుంచుతూ.

అతని మోకాళ్ళపై చేతులాన్చి, తలెత్తి చూసింది లూసీ.

"హౌడు యు ఫీల్ నౌ డార్లింగ్?"

"ఓహ్!" పెదిమలపై నవ్వు తెచ్చుకుంటూ భుజాలెగరేశాడు రాణా.

"ఎ లిటిల్ బిట్ టైర్డ్. దట్సాల్. పోస్ట్ హాస్పిటల్ డిప్రెషన్ అంటారు దీన్ని."

వెనక్కి జరిగి,సాలోచనగా అతని పాదాలని వేళ్ళతో రుద్దుతూ అంది లూసీ "డాడీకి నేను నిన్ను పెళ్ళి చేసుకోవటం యిష్టంలేదు. కావున డాడీనే వదిలివేయడానికి నిశ్చయించుకున్నాను."

"వదిలి....?" త్రుళ్ళిపడ్డాడు రాణా.

"ఎస్ రాణా! నువ్వు హాస్పిటల్ లో వుండగా నేనెన్నో గుణపాఠాలు నేర్చుకున్నాను. ఊహించినదానికంటే ఎక్కువగా నిన్ను ప్రేమిస్తున్నానని తెలుసుకున్నాను. నా తండ్రికంటె నువ్వే ఎక్కువన్న నిర్ణయానికి వచ్చాను. ప్రపంచంలో అతనికంటె విలువైనది నువ్వే అని గ్రహించాను. కానీ, అంతకుముందు నా హృదయం చలించింది. నిస్సహాయంగా నువ్వు పడివున్నప్పుడు ఒకసారి నేను నీ నుండి దూరంగా పారిపోదామనుకున్నాను"

అతను ఆమె దగ్గరగా జరిగాడు.

ఆమె ముఖాన్ని ప్రేమగా చేతుల మధ్యకు తీసుకుంటూ మౌనంగా వుండిపోయాడు.

"నువ్వు ప్రవర్తించిన తీరు...." గాద్గదికంగా పలికిందామె కంఠం. "నువ్వు మాట్లాడిన దారుణమైన మాటలు అన్నీ నన్ను భయపెట్టాయి—అసలు ఆ వ్యక్తి నువ్వేనని నమ్మలేకపోయాను."

"అప్పుడు నిజంగా నేను-నేను కాదు లూసీ" గంభీరంగా పలికాడు రాణా.

"ఐ అండర్ స్టాండ్ రాణా! కాని అదంతా భయంకరమైన పీడకలగా గడిచిపోయింది. నువ్వు బెడ్ మీద అసాధారణంగా ప్రవర్తించిన రోజు—నా భవిష్యత్తు

శూన్యంగా కనబడింది. త్వరలో మళ్ళీ ఈ విధంగా నన్ను దగ్గరగా తీసుకుంటావని - ఖచ్చితంగా ఊహించలేదు. నీ నుండి పారిపోదామని డాడీకి ఫోన్ చేసాను. కానీ ఆయనతో మాట్లాడుతుండగా అకస్మాత్తుగా నా అంతరాత్మ ఎదురు తిరిగింది. నువ్వు లేకుండా జీవించలేనని అప్పుడు గుర్తుకొచ్చింది. నీముందు యెవరూ నాకు ముఖ్యం కాదనీ, నా తండ్రి కూడా ముఖ్యం కాదనీ, ఆయన డబ్బూ, హోదా...."

"లూసీ!"

"బిలీవ్ మీ రాణా."

"లూసీ! నేను చెప్పేది విను. రెండు వారాల్లు ఆగు. ఇప్పుడే నిర్ణయం తీసుకోవద్దు."

"అవసరం లేదు. నా గురించి నాకు తెల్సు."

"ఓ. కే. హనీ! నామీద నిజంగా ప్రేమ వుంటే ఓ పని చెయ్. ఈ వారం రోజులు నువ్వు తీవ్రంగా ఆలోచిస్తూ మానశికంగా అలిసిపోయావ్. నువ్వు ఖచ్చితమైన నిర్ణయం తీసుకున్నావని నాకు అనిపించాలి. అది యిద్దరికీ క్షేమం."

"అండ్ వాట్ ఎబౌట్ యూ డార్లింగ్? నీకు సిరమైన అభిప్రాయం వుందా నా మీద?"

అతను బరువుగా కుర్చీలో వెనక్కి వాలాడు. "నీ మీద సిరమైన అభిప్రాయాలున్నాయి లూసీ. కాని నామీద నాకే లేవు. నాకు కొంత గడువు కావాలి. ఖచ్చితమైన నిర్ణయాలు తీసుకోకుండా చేస్తున్నాయి గత పదిరోజుల్లో జరిగిన సంఘటనలు...."

ఆ మాటల్లోని లోతు అర్థం గ్రహించలేదు లూసీ.

"అందుకేనా నన్ను ఆలోచించుకోమంటున్నావ్?-

నీకు శైలం కావాలి కనుకనా?" అతని ప్రేమపై ఒక్క క్షణం అపనమ్మకం ఏర్పడిందామెకి.

"ఒక విధంగా నువ్వు చెప్పిందే నిజం," గుంభనంగా అన్నాడు రాణా. "నన్ను నేను లోతుగా అవలోకించుకోవాలి."

ఆమె నీలి కళ్ళల్లో కన్నీళ్ళు చిమ్మాయి.

ఇద్దరి మధ్యా కొద్ది నిముషాలు మౌనం రాజ్యం చేసింది. ఆమె అకస్మాత్తుగా తల పైకెత్తి అతని ముఖంలోకి చూసింది. "రాణా! నన్ను ఈ రాత్రికి యిక్కడే వుండనీ."

"నీ ఫాదర్ ...."

"నీకు యిప్పుడే చెప్పాను ఆయన విషయం నా కంత ముఖ్యం కాదని. నీకు దూరంగా వుండటం నాకు యిష్టం లేదు. కనీసం ఈ రోజు."

"ఓ. కే. హనీ! దాని గురించి వాదన యెందుకు?" అన్నాడు రాణా వాతావరణాన్ని చల్లబరుస్తూ.

"డాడీకి తర్వాత ఫోన్ చేసి చెప్తాను." అతని ముఖం మీద తన ముఖం ఆన్చిందామె. "నాకు గడువు అక్కర్లేదు రాణా! కాని తీసుకుంటాను. నువ్వు త్వరగా నిర్ణయం తీసుకోవడమే నాకు కావలసింది. అంతగా నేను నీకు అక్కర్లేదు అనుకుంటే...." పంటి బిగువున దుఃఖం దిగమింగుతూ చెప్పింది...."నీకు దూరంగా పోతాను."

అతను ఆమె పెదాలను బలంగా ముద్దు పెట్టుకున్నాడు.

ముసురుపట్టిన ఆమె ముఖాన్ని చూసి ఒక్కసారిగా

నవ్వుతూ అన్నాడు. "ఓ. కే. లవ్! అది మన ఒప్పందం."

ఇద్దరూ కాఫీ తాగుతూ, కాసేపు ఎవరి ఆలోచనల్లో వారు మునిగిపోయారు.

క్రమంగా రాణా హృదయం తేలిక పడింది.

*　　　*　　　*

బొంబాయి నగర వీధులు రద్దీగా వున్నాయ్.

ట్రాఫిక్ కోలాహలాన్ని తప్పించుకుంటూ, ప్రెసిడెంటు స్ట్రీటులోకి మలుపు తిరిగాడు రాణా.

అసంఖ్యాకమైన వుద్యోగులు, కార్మికులు, హడావుడిగా కార్యాలయాల్లోకీ, ఫాక్టరీల్లోకి చేరుకుంటున్నారు.

ఆ దృశ్యం పెద్ద కొండరాయికింద సందు చేసుకుని దూరే చీమల్ని గుర్తుకు తెస్తోంది....

ఎన్విరాన్‌మెంట్ బిల్డింగ్‌లో అడుగు పెట్టి లిఫ్ట్ ద్వారా, ఎనిమిదో అంతస్థు చేరుకున్నాడు రాణా.

హాల్లో ప్రవేశిస్తూ లేడీ సెక్రటరీ లోలాను విష్ చేసాడు నవ్వుతూ.

ఆశ్చర్యపోతూ ఆమె కురిపిస్తున్న ప్రశ్నల వర్షానికి జవాబుగా, తన ఆరోగ్యం బాగానే వుందనీ, మిగతా కథ తర్వాత చెబ్తానని చెప్పి, బాస్ గదివైపు నడిచాడు.

తలుపు టకటక లాడించి లోపలకు నడిచాడు రాణా. ముందున్న కాగితాల్లోంచి బైటికి తొంగి చూసాడు కళ్ళద్దాలగుండా రామ్‌కింకర్. "ఆహా! రాణా! ఫీలింగ్ ఓ. కే.? గుడ్! అలా కూర్చో ఒక క్షణం."

రిపోర్టు చదువుతున్న బాస్, బట్టతలని పరిశీలిస్తూ కుషన్డ్ సీట్లో కూలబడ్డాడు రాణా.

రెండు నిముషాల తర్వాత రామ్‌కింకర్ తన పని ముగించి, కాగితాల్ని జాగ్రత్తగా సర్ది నీట్‌గా ఓ ప్రక్క పెట్టి రాణాకేసి చూసాడు.

"వెల్ రాణా!" పొడిగా దగ్గి ప్రారంభించాడు. "నువ్వు పంపిన ఫోటోగ్రాఫ్స్ ప్రాసెస్ చేయించి పరీక్షించాను. అందులో కొన్ని ఐటెమ్స్ వింతగా వున్నాయి. కానీ వాటికీ, మన డిపార్టుమెంటుకి సంబంధం లేదు. ఖుల్నా ఏరియాలో లోపలిభాగంలో నువ్వు తీసిన ఫోటోగ్రాఫ్స్ చాలా ఇంటరెస్టింగ్‌గా వున్నాయి. అయితే ఆ విషయం గురించి తర్వాత చర్చించుకోవచ్చు. ముందుగా నువ్వు ఇన్వాల్వ్ అయిన భూకంపం గురించి మరోసారి పూర్తిగా చెప్పు. మొదట్నించీ, ఒక్క విషయం కూడా వదిలిపెట్టకుండా...."

రాణా తనకు జ్ఞాపకమున్న అన్ని విషయాలూ, వరుసగా, పూసగుచ్చినట్లు చెప్పసాగాడు....

కాని, ఆ చిన్న అమ్మాయిని రక్షించిన సన్నివేశం వివరిస్తుండగా హఠాత్తుగా అతని మెదడు శూన్యం అయింది.

"రాణా!" రామ్‌కింకర్ టేబుల్‌మీద ముందుకు వంగాడు.

"జ్ఞాపకం తెచ్చుకోవడానికి ప్రయత్నించు.... నేల తెరుచుకోకముందు ప్రేలుడు లాంటిది ఏమైనా వినపడిందా?...."

"నో సర్. డెఫినిట్లీ నాట్. భూమిలో బయలుదేరిన రణగొణధ్వని విన్నానంతే. తర్వాత క్రాక్ ఏర్పడ్డం నేల రెండుగా చీలిపోవడం... నో బాస్! ప్రేలుడు జరగ

లేదని నేను ఖచ్చితంగా చెప్పగలను."

రామ్‌కింకర్ నిరుత్సాహంగా వెనక్కి జారబడ్డాడు. కళ్ళద్దాలు తీసి కర్చీఫ్‌తో తుడుచుకున్నాడు.

చిన్నగా దగ్గి, సాలోచనగా చూపుడువేలు, బొటన వేళ్ళతో ముక్కు పై భాగాన్ని రుద్దుకున్నాడు.

కళ్ళద్దాలు తిరిగి తగిలించి, మళ్ళీ ముందుకు వంగాడు.

"యు సీ రాణా! నిన్ను అగాధంలోంచి పైకి తీసుకు వచ్చిన కొద్దిక్షణాల్లో లోపల్నుంచి మేఘంలాంటి పొగ వెలువడిందని చెప్పబడింది."

"అందుకే గ్రౌండ్‌లో ఎక్స్‌ప్లోషన్ జరిగిందని భావిస్తున్నారా??

"అది ఒక కారణం కావచ్చు."

"ఆ సంఘటనకీ, ఖుల్నా మిలటరీ బేస్‌కీ సంబంధం వుందని భావిస్తున్నారా?"

"నో....నో.........అలా అనుమానించడానికి తగిన ఆధారాలు మనదగ్గరేమీ లేవు. నీకు నువ్వే చెప్పావు కూడా దానికి, దీనికీ సంబంధం లేదని."

"చెప్పాను. నిజమే. కాని ఈ విషయంలో నాకింకా అనుమానాలు లేకపోలేదు.

నిన్న కాంబేనుంచీ తిరిగి వస్తుండగా పొగమంచులోకి ప్రవేశించాను. బాస్! ఐయామ్ టాకింగ్ ఎబౌట్ ఎ మిస్టీరియస్ క్లౌడ్! ఆ మేఘం పసుపు రంగులో వుండడం ఎంత విచిత్రం? మిలటరీ ప్రయోగాల్లో వాళ్ళు వుపయోగించిన స్మోక్‌స్క్రీన్‌లాంటిది ఏమైనా తేలుకుంటూ వస్తోందా?"

(సశేషం)